సాక్షి చిత్తూరు



తెప్పపై తేజోమయుడు

పిచ్చాటూరు : నాగలాపురంలోని వేదవల్లీ సమేత వేదనారాయణస్వామివారి సూర్యపూజ తెప్పోత్సవం ఆదివారం కనులపండువగా సాగింది.



శ్రీవారి దర్శనానికి 24 గంటలు

తిరుమల: ఎలాంటి టికెట్లు లేని భక్తులకు తిరుమల శ్రీవారి దర్శనానికి 24 గంటల సమయం పడుతోంది. క్యూ కాంప్లెక్స్‌లో 26 కంపార్ట్ మెంట్లు నిండాయి.



30 నుంచి పెద్దకొట్టాయి ఉత్సవం

శ్రీకాళహస్తి: ముక్కంటి పెద్దకొట్టాయి ఉత్సవాన్ని ఈ నెల 30వ తేదీ నుంచి ఏప్రిల్ 5వ తేదీ వరకు అత్యంత వైభవంగా నిర్వహించనున్నట్లు ఈఓ సాగర్‌బాబు ఆదివారం తెలిపారు.

రంజాన్ వేళలు

	ఇఫ్తార్ సోమవారం(సా)	సహర్ మంగళవారం(ఉ)
తిరుపతి	6.27	4.52
చిత్తూరు	6.29	4.52
పుంగనూరు	6.31	4.56

న్యూస్‌రీల్

బోయకొండ కిటకిట



ఆలయంలో భక్తుల రద్దీ



ప్రత్యేక అలంకారంలో అమ్మవారు

చౌడేపల్లె: కోరిన కోర్కెలుతీర్చి ఆరాధ్య దైవంగా విరాజిల్లుతున్న బోయకొండ గంగమ్మ తల్లి ఆశీస్సులకోసం వివిధ ప్రాంతాలనుంచి ఆదివారం అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. ఆలయ అర్చకులు అమ్మవారిని అత్యంత సుందరంగా అలంకరించి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. కోరిన కోర్కెలు తీరిన భక్తులు కుటుంబ సమేతంగా అమ్మవారిని దర్శించుకొని జంతు బలులు సమర్పించి మొక్కు చెల్లించారు. ఆలయంలో ఉదయం 7నుంచి సాయంత్రం 5 గంటల వరకు రద్దీ కొనసాగింది. భక్తులకు ఆలయ ఈఓ చంద్రమౌళి ఆధ్వర్యంలో తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు తలెత్తకుండా ఎస్‌ఐ రవికుమార్ నిఘా ఏర్పాటుచేశారు.

జిల్లాకు చేరిన 104 వాహనాలు

చిత్తూరు రూరల్: జిల్లాకు 104 వాహనాలు కొత్తగా 13 వచ్చాయి. ఈ వాహనాలు జిల్లా కేంద్రానికి ఆదివారం చేరుకున్నాయి. ఇందులోని 7 వాహనాలను చిత్తూరులో ఉంచారు. మరో 6 వాహనాలను పలమనేరుకు పంపారు. వీటిని సోమవారం జిల్లా కలెక్టర్ హరినారాయణన్, జేసీ వెంకటేశ్వర్లు చేతుల మీదుగా ప్రారంభించేందుకు అధికారులు ఏర్పాట్లు చేశారు. జిల్లాలో ఇదివరకు 31 వాహనాలు నడుస్తుండగా, కొత్తగా వచ్చిన 13 వాహనాలతో కలిపి మొత్తం 44 వాహనాలు ఉంటాయని ఆ విభాగ అధికారులు చెప్పారు.

అటవీ శాఖలో పనులపై అవగాహన

చిత్తూరు కార్పొరేషన్: అటవీశాఖలో జరిగే సివిల్ పనులపై జిల్లా స్థాయి అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అటవీశాఖ అతిథి గృహంలో ఆదివారం సిబ్బందికి పలు అంశాల గురించి సివిల్ ఇంజినీర్ కాసిం తెలియజేశారు. సాధారణంగా అటవీ శాఖలో ఇలాంటి పనులకు ప్రైవేటుగా సివిల్ ఇంజనీర్ వద్ద ప్రణాళిక వేసుకొని పనులు చేస్తామని డీఎఫ్‌ఓ చైతన్యకుమార్‌రెడ్డి తెలిపారు. అలా కాకుండా నేరుగా సివిల్ ఇంజనీర్ పనుల గురించి అవగాహన కల్పించామన్నారు. కార్యక్రమంలో ఎఫ్‌ఆర్వో బాలకృష్ణారెడ్డి, థామస్, చంద్రశేఖర్, డీఈర్వో, ఎఫ్‌బీఓలు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నేడు కలెక్టరేట్‌లో స్పందన

చిత్తూరు కలెక్టరేట్ : ప్రజల సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 27న కలెక్టరేట్‌లో స్పందన కార్యక్రమం నిర్వహించనున్నట్లు కలెక్టరేట్ అధికారులు వెల్లడించారు. ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు స్పందన కార్యక్రమం నిర్వహించనున్నారు. దీనికి అన్ని శాఖల జిల్లా అధికారులు తప్పనిసరిగా హాజరు కావాలని చెప్పారు.

నేడు పోలీసు కార్యాలయంలో స్పందన

చిత్తూరు అర్బన్: నగరంలోని జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం స్పందన కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎస్పీ రిషాంత్‌రెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. చిత్తూరు వన్‌టౌన్ పోలీస్ స్టేషన్ పక్కనున్న ఆర్మ్‌డు రిజర్వు (ఏఆర్) కార్యాలయంలో ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తామని.. ఏవైనా సమస్యలుంటే నేరుగా తనను కలిసి మాట్లాడొచ్చని పేర్కొన్నారు.

1న బాలకాండ పారాయణం

తిరుమల: లోకకల్యాణం కోసం శ్రీవారిని ప్రార్థిస్తూ తిరుమలలోని నాదనీరాజనం వేదికపై ఏప్రిల్ 1వ తేదీన 15వ విడత బాలకాండ అఖండ పారాయణం నిర్వహించనున్నట్లు టీటీడీ ఆదివారం తెలిపింది. ఈ కార్యక్రమాన్ని ఎస్వీబీసీ ప్రత్యక్ష ప్రసారం చేయనుందని వెల్లడించింది. ఎస్వీ వేద విశ్వవిద్యాలయం, టీటీడీ వేదపండితులు, సంభావన పండితులు, అన్నమాచార్య ప్రాజెక్ట్, జాతీయ సంస్కృత విశ్వవిద్యాలయ పండితులు ఈ కార్యక్రమంలో పాల్గొని మొత్తం 114 శ్లోకాలను పారాయణం చేయనున్నట్లు వివరించింది.

డ్రిప్ సాగు.. భలే బాగు

జిల్లాలో డ్రిప్‌సాగు(బిందుసేద్యం) విస్తీర్ణం ఏటా పెరుగుతోంది. నీటి పొదుపు, అధిక దిగుబడి, ఆదాయం పొందేందుకు ఈ బిందు సేద్యంపై రైతులు మొగ్గుచూపుతున్నారు. జిల్లాలో అత్యధికంగా సాగవుతున్న ఉద్యానవన పంటల్లో డ్రిప్, స్ప్రింక్లర్లు, మల్చింగ్ షీట్ వంటి ఆధునిక పద్ధతులను అవలంబిస్తూ రైతులు లాభాల బాట పడుతున్నారు. ప్రభుత్వం రాయితీలతోపాటు కంపెనీని ఎంచుకునే అవకాశం కల్పించడం రైతులకు వరంగా మారింది. 2022–23కు జిల్లాలో ఐదువేల హెక్టార్లలో డ్రిప్, ఇతర పరికరాలు అందించాలని లక్ష్యంగా నిర్ణయించారు.



- నీటి పొదుపు.. ఎక్కువ దిగుబడి
- ఉద్యానపంటలకు అధిక వినియోగం
- రైతులకు భారీగా సబ్సిడీ సాయం
- నచ్చిన కంపెనీని ఎంచుకునేలా రైతులకు అవకాశం కల్పించిన సర్కారు
- డిమాండ్‌కు తగినట్లు డ్రిప్ పరికరాలు, స్ప్రింక్లర్లు అందజేత

సాక్షి, చిత్తూరు: రాష్ట్రంలోనే చిత్తూరు జిల్లాలో మాత్రమే ఉద్యాన పంటల విస్తీర్ణం ఎక్కువగా ఉంది. సుమారు లక్ష హెక్టార్లకు పైగా ఉద్యాన పంటలు సాగు చేసి రైతులు ఆదాయం పొందుతున్నారు. ప్రధానంగా మామిడి టమాట, క్యాబేజీ, క్యాలీఫ్లవర్, బీన్స్, వంగ, బెండ, ద్రాక్ష పండ్ల తోటలు సాగు చేస్తున్నారు. అత్యధికంగా మామిడి మాత్రమే సుమారు 60 వేల హెక్టార్లలో సాగులో ఉంది. డ్రిప్, స్ప్రింక్లర్లు, మల్చింగ్ షీట్ వంటి ఆధునిక పద్ధతులను ఉపయోగిస్తున్నారు.

నచ్చిన కంపెనీ ఎంపిక

రాష్ట్ర ప్రభుత్వం ఎక్కువ కంపెనీలకు అవకాశం ఇచ్చి డ్రిప్ పరికరాలను అందజేసేలా పర్యవేక్షిస్తోంది. నాణ్యతను పెంచుకోవడం కోసం ప్యాక్ హౌసులు, కోల్డ్ స్టోరేజీలు ఏర్పాటు చేసుకునేందుకు రాయితీ ఇస్తోంది. స్ప్రేయర్లు, ఆధునిక యంత్ర సామగ్రిని సరఫరా చేస్తోంది. టమాటా సాగుకు సంబంధించి చిన్న తరహా ప్రాసెసింగ్ యూనిట్ల ఏర్పాటు, రవాణా వాహనాలు అందజేస్తోంది. సమగ్ర ఉద్యాన అభివృద్ధి మిషన్, రాష్ట్రీయ కృషి వికాస్ యోజన, ఆంధ్రప్రదేశ్ సమీకృత నీటిపారుదల, వ్యవసాయ పరివర్తన పథకం, ఆంధ్రప్రదేశ్ నీటిపారుదల జీవనోపాధుల అభివృద్ధి ద్వారా జిల్లాలో ఉద్యాన పంటలను అభివృద్ధి చేస్తున్నారు. జిల్లాలోని 31 మండలాల్లో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించి రాయితీపై పరికరాలను ఇస్తున్నారు.



డ్రిప్ పరికరాలతో వి.కోటకు చెందిన ఆనంద్

5వేల హెక్టార్లకు డ్రిప్ పరికరాలు

చెరకు, మల్బరి, పశుగ్రాస పంటలకు నీటి వసతి ఉన్న రైతులందరికీ వంద శాతం మైక్రో ఇరిగేషన్ లక్ష్యంగా కార్యాచరణ ప్రణాళిక అమలు చేస్తున్నారు. 2022– 23 సంవత్సరంలో జిల్లాలో ఐదువేల హెక్టార్లలో డ్రిప్, ఇతర పరికరాలు అందించాలని లక్ష్యంగా నిర్ణయించారు. ఐదు ఎకరాల్లోపు ఉన్న సన్న, చిన్నకారు రైతులకు 90 శాతంతో 2.18 లక్షల రాయితీతో పరికరాలు అందిస్తున్నారు. ఐదు నుంచి పది ఎకరాల వరకు కలిగిన రైతులకు 70 శాతంతో రూ.3.46 లక్షల రాయితీతో పరికరాలను అందిస్తున్నారు. సన్న చిన్న కారు రైతులకు 55 శాతంతో స్ప్రింక్లర్ పరికరాలు, ఐదు ఎకరాల నుంచి పది ఎకరాల ఉన్న రైతులకు 45 శాతంతో పరికరాలను అందిస్తున్నారు. ఇప్పటికే సుమారు 15 వేల హెక్టార్లకు పైగా రైతులు దరఖాస్తు చేసుకున్నారు.

దరఖాస్తు ఇలా

జిల్లాలో 16 కంపెనీలకు చెందిన డ్రిప్, అనుబంధ పరికరాలు అందిస్తున్నారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న రైతులకు మొదట సర్వే నిర్వహించి అంచనాలను రూపొందిస్తారు. జిల్లా కలెక్టర్ అనుమతి పొందిన తర్వాత డ్రిప్ ఏర్పాటు చేసే (ఇన్సులేషన్) కంపెనీకి ఆ దరఖాస్తు పంపుతారు. ఆ కంపెనీ ప్రతినిధితో పాటు హార్టికల్చర్ అసిస్టెంట్ పరిశీలించి సర్వే చేస్తారు. అంచనాలకు సంబంధించి సబ్సిడీ రుణం పోను మిగతా సొమ్ము ఆన్‌లైన్ ద్వారా నగదు చెల్లిస్తారు. తర్వాత 15 రోజుల్లోపు పరికరాలు అమర్చుతారు. 2022–2023లో 6512 మంది రైతులకు రూ. 61.80 కోట్ల విలువైన డ్రిప్ పరికరాలు అందించారు. 5719 హెక్టార్లలో పంటలు సాగులోకి తీసుకొచ్చారు. రైతులు రూ.51.37 కోట్లు సబ్సిడీ పొందారు.



తన పొలంలో డ్రిప్ పరికరాలతో బైరెడ్డిపల్లెకు చెందిన కుమార్




వ్యవసాయ పొలంలో పండిన కాయగూరలు చూపుతున్న శాంతిపురానికి చెందిన భారతి



తన పొలంలో డ్రిప్ పరికరాలతో శాంతిపురానికి చెందిన రాము

ఖర్చుతక్కువ..ఆదాయం ఎక్కువ



ఉద్యాన వన రంగంలో భారీ ఎత్తున మార్పులు వచ్చాయి. యంత్ర సామగ్రి అందుబాటులోకి వచ్చింది. మంచి ఆదాయం పొందేందుకు అవకాశం ఏర్పడింది. మా వ్యవసాయ క్షేత్రంలో ఉద్యాన పంటలు వేశాం. మంచి దిగుబడి, ఆదాయం వచ్చింది. డ్రిప్, స్ప్రింక్లర్లు, మల్చింగ్ షీట్ ఎంతగానో ఉపయోగపడ్డాయి.

– ఎన్.రెడ్డెప్ప, ఎంపీ, చిత్తూరు

లక్ష్యాలను పూర్తి చేశాం



ఉద్యానవన పంటలు విస్తృతంగా సాగుచేయడంలో చిత్తూరు జిల్లా అగ్రస్థానంలో ఉంది. డ్రిప్, స్ప్రింక్లర్ల విధానంలో సాగు చేస్తే నీటి ఆదాతో పాటు భూగర్భ జలమట్టం పడిపోకుండా ఉంటుంది. ఈ ఆర్థిక సంవత్సరంలో ఐదు వేల హెక్టార్లలో బిందు సాగుకు సంబంధించి పరికరాలు ఇవ్వాలని లక్ష్యంగా నిర్ణయించాం. లక్ష్యాలను పూర్తి చేశాం.

– మధుసూదన్ రెడ్డి
జిల్లా మైక్రో ఇరిగేషన్ అధికారి

15 రోజుల్లోనే మంజూరు



జిల్లాలో ఎక్కువ భాగం ఉద్యాన పంటలు సాగవుతున్నాయి. ఎక్కువ భాగం ఆరుతడి నీరు ఇవ్వాల్సి ఉంటుంది. అందుకోసం ఎక్కువగా డ్రిప్ స్ప్రింక్లర్లు ద్వారా వ్యవసాయం చేసేలా ఏర్పాట్లు చేస్తున్నాం. ఎన్నడూ లేని విధంగా కంపెనీని రైతులే ఎంపిక చేసుకోవచ్చు. డిపాజిట్ చెల్లించిన 15 రోజుల్లో డ్రిప్ పరికరాలు పొందవచ్చు.

–ఎం.హరినారాయణన్,
జిల్లా కలెక్టర్, చిత్తూరు

మహిళలే వైఎస్సార్ సీపీ బలం బలగం



సమావేశానికి భారీగా హాజరైన మహిళలు



చెక్కు పంపిణీ చేస్తున్న మంత్రి ఆర్కే రోజా

- జనం గుండెల్లో జగనన్న ఉన్నారు
- రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి ఆర్కే రోజా
- 14,468 మందికి రూ.15.51 కోట్ల వైఎస్సార్ ఆసరా చెక్కు పంపిణీ

నగరి : మహిళలే వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ బలం బలగం అని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, యువజన సర్వీసుల, క్రీడాశాఖ మంత్రి ఆర్కే రోజా అన్నారు. స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానంలో ఆదివారం ఏర్పాటు చేసిన వైఎస్సార్ ఆసరా 3వ విడత చెక్కుల పంపిణీ భారీ బహిరంగ సభకు ఆమె ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. నగరి మునిసిపల్, మండల పరిధిలో లబ్ధిదారులైన 14,468 మంది మహిళలకు రూ.15.51 కోట్ల చెక్కును ఆమె అందజేశారు. తోబుట్టువులా తమను ఆదుకుంటున్నారంటూ మహిళలు మంత్రితో కలిసి ముఖ్యమంత్రి చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. కేక్ కట్‌చేసి మంత్రికి తినిపించి తమ ఆనందాన్ని పంచుకున్నారు. సమావేశంలో మంత్రి మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా 78.94 లక్షల మంది మహిళలకు ఆసరా 3వ విడత ద్వారా రూ. 6419.89 కోట్లు ప్రభుత్వం అందిస్తోందన్నారు. నగరి నియోజకవర్గ పరిధిలో 44,750 మందికి రూ.46.3 కోట్లు ఆసరా 3వ విడతలో అందిస్తున్నట్లు వివరించారు. ఆసరా, సున్నా వడ్డీ రుణాలు, చేయూత, జగనన్నతోడు, బ్యాంకు లింకేజీ, జగనన్న ఇళ్ల పథకాలతో మహిళలను అభివృద్ధి పథంలో నడిపిస్తున్నామన్నారు. ఒక్క నగరి మున్సిపాలిటీలోనే ఇప్పటి వరకు ఈ పథకాల ద్వారా 55,236 మంది మహిళలకు రూ.187.56 కోట్ల లబ్ధి చేకూరిందని చెప్పారు. మహిళలు గత పాలనలో ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొన్నారు కనుకే ఎన్నికల సమయంలో మభ్యపెట్టడానికి పసుపుకుంకుమ ఇచ్చిన చంద్రబాబుకు మహిళలు ఉప్పు, కారం పెట్టి సాగనంపారని విమర్శించారు. సీఎం వైఎస్ జగన్ ప్రతి పథకం మహిళల పేరిటే అమలు చేస్తున్నారని గుర్తుచేశారు. దేశంలో ఎక్కడా మహిళలకు ఇంతటి ప్రాధాన్యం ఇవ్వడం లేదని స్పష్టం చేశారు. మనసున్న ముఖ్యమంత్రి తమను పాలిస్తున్నాడని, తాను మంచి వ్యక్తికి ఓటు వేశానని ప్రతి మహిళ నేడు గర్వపడుతోందని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో సుజన, మెప్మా పీడీ రాధమ్మ, మంత్రి సోదరులు రామ్‌ప్రసాద్ రెడ్డి, మునిసిపల్ కమిషనర్ వెంకట్రామిరెడ్డి, ఎంపీడీవో చంద్రమౌళి, మునిసిపల్ చైర్మన్ పీజీ నీలమేఘం, ఎంపీపీ భార్గవి, రాష్ట్ర రెడ్డి కార్పొరేషన్ డైరెక్టర్ చంద్రారెడ్డి, మొదలియార్ కార్పొరేషన్ డైరెక్టర్ బాలకృష్ణ, మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ మాహిన్, మునిసిపల్ వైస్‌చైర్మన్ వెంకటరత్నం, వైస్ ఎంపీపీ కన్నియప్ప, మెప్మా అధికారి సునీత, పీఏసీఎస్ చైర్మన్ తిరుమలరెడ్డి, కౌన్సిలర్లు, కో–ఆప్షన్ సభ్యులు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, పార్టీ నాయకులు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు, మహిళా సమాఖ్య సభ్యులు పాల్గొన్నారు.

పెండింగ్ కేసులను త్వరగా పరిష్కరించండి

- హై కోర్టు జడ్జి జస్టిస్ మానవేంద్రనాథ్ రాయ్

చిత్తూరు అర్బన్: న్యాయస్థానాల్లో పెండింగ్‌లో ఉన్న కేసులను త్వరగా పరిష్కరించడానికి ప్రతి ఒక్క న్యాయమూర్తి కృషి చేయాలని హైకోర్టు జడ్జి, జిల్లా పోర్టు ఫోలియో జడ్జి జస్టిస్ మానవేంద్రనాథ్ రాయ్ పిలుపునిచ్చారు. ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని న్యాయమూర్తులతో ఆదివారం నగరంలోని జెడ్పీ సమావేశపు హాలులో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ న్యాయస్థానాల్లో దీర్ఘకాలికంగా పెండింగ్‌లో ఉన్న కేసుల పరిష్కారానికి ఓవైపు అదాలత్ ఉపయోగపడుతున్నా.. రాజీ చేయలేని కేసులను కోర్టుల్లోనే పరిష్కరించాలని చెప్పారు. ఐదు సంవత్సరాలకు పైబడి కోర్టులోనే పెండింగ్‌లో ఉన్న కేసులపై ప్రత్యేక దృష్టి సారించాలని చెప్పారు. అనంతరం కోర్టుల వారీగా పెండింగ్‌లో ఉన్న కేసులపై న్యాయమూర్తులతో సుదీర్ఘంగా చర్చించారు. ఈ సమావేశంలో జిల్లా జడ్జి భీమారావు, న్యాయమూర్తులు శాంతి, వెన్నెల, రవి తదితరులు పాల్గొన్నారు.

ఆర్‌అండ్‌బీ అతిథి గృహంలో హైకోర్టు జడ్జికి కలెక్టర్ హరినారాయణన్, ఎస్పీ రిషాంత్‌రెడ్డి, జెడ్పీ సీఈవో ప్రభాకర్‌రెడ్డి తదితరులు మర్యాదపూర్వకంగా స్వాగతం పలికారు. న్యాయశాఖలో ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని రాష్ట్ర ఉద్యోగుల సంఘ నాయకులు గోపినాథ్‌రెడ్డి, రవిరెడ్డి తదితరులు కోరారు. అనంతరం జడ్జికి జ్ఞాపిక అందజేశారు.




సమావేశానికి హాజరైన జిల్లా న్యాయమూర్తులనుద్దేశించి మాట్లాడుతున్న హైకోర్టు జడ్జి జస్టిస్ మానవేంద్రనాథ్ రాయ్

న్యాయవాదుల సంఘానిది ఘన చరిత్ర

చిత్తూరు అర్బన్: చిత్తూరులో ఉన్న బార్ (న్యాయవాదుల సంఘం) అసోసియేషన్‌కు ఘన చరిత్ర ఉందని రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి చీకటి మానవేంద్రనాథ్ రాయ్ అన్నారు. చిత్తూరులోని బార్ అసోసియేషన్‌లో ఆదివారం న్యాయవాదులు ఏర్పాటు చేసిన సమావేశానికి ఆయన హాజరయ్యారు. జస్టిస్ మాట్లాడుతూ వందేళ్లకు పైగా చరిత్ర కలిగిన చిత్తూరు న్యాయవాదుల సంఘం అభివృద్ధికి కృషి చేస్తామన్నారు. అనంతరం హైకోర్టు న్యాయమూర్తిని సన్మానించి, జ్ఞాపిక అందచేశారు. జిల్లా జడ్జి భీమారావు, రాష్ట్ర న్యాయవాద మండలి సభ్యులు నల్లారి ద్వారకనాథరెడ్డి, చిత్తూరు బార్ అధ్యక్షులు రాజేంద్రరెడ్డి, కార్యదర్శి అశోక్ ఆనంద్ యాదవ్ ఇతర న్యాయమూర్తులు, న్యాయవాదులు పాల్గొన్నారు.

ఏడు రోజుల్లో పది పరీక్షలు

- వచ్చే నెల 3 నుంచి ప్రారంభం
- చిత్తూరు జిల్లాలో 115 పరీక్ష కేంద్రాలు
- హాజరుకానున్న 21,520 మంది విద్యార్థులు



సిబ్బందికి సూచనలిస్తున్న కలెక్టర్ హరి నారాయణన్ (ఫైల్)

చిత్తూరు కలెక్టరేట్ : పదో తరగతి పరీక్షలు మరో ఏడు రోజుల్లో ప్రారంభం కానున్నాయి. నిర్వహణకు విద్యాశాఖ అధికారులు పటిష్ట ఏర్పాట్లు చేశారు. జిల్లాలో పది పరీక్షలను పకడ్బందీగా నిర్వహించేందుకు కసరత్తు నిర్వహిస్తున్నారు. పరీక్షలు ఉదయం 9.30 నుంచి 12.45 గంటల వరకు జరగనున్నాయి. కలెక్టర్ హరి నారాయణన్ ఇప్పటికే పరీక్షల నిర్వహణ చీఫ్, డిపార్ట్‌మెంట్ అధికారులకు ముఖ్య సూచనలు ఇచ్చారు. జిల్లా వ్యాప్తంగా 21,560 మంది రెగ్యులర్ విద్యార్థులు హాజరు కానుండగా 115 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు. 436 మంది ప్రైవేట్ విద్యార్థులు పరీక్షలకు హాజరవుతున్నారు. పరీక్షల పర్యవేక్షణకు సిట్టింగ్, ఫ్లయింగ్ స్క్వాడ్స్ బృందాలను ఏర్పాటు చేశారు.

జంబ్లింగ్ విధానం అమలు

విద్యార్థులకు పరీక్ష కేంద్రాలను మల్టిపుల్ జంబ్లింగ్ విధానంలో కేటాయించనున్నారు. ఎలాంటి ఇబ్బందులు లేకుండా మౌలిక వసతులు కల్పించారు. విద్యార్థుల హాల్‌టికెట్స్ ఆన్‌లైన్‌లో అందుబాటులో ఉంచారు. గత ఏడాది చిత్తూరు జిల్లా పది పరీక్షల నిర్వహణలో జరిగిన తప్పిదాలు పునరావృతం కాకుండా పటిష్ట చర్యలు చేపట్టారు. పబ్లిక్ పరీక్షలకు హాజరయ్యే చీఫ్, డిపార్ట్‌మెంట్, ఇన్విజిలేటర్లు, విద్యార్థులతో సహా ఎవరూ సెల్‌ఫోన్లను లోనికి తీసుకెళ్లేందుకు అనుమతి లేదు. పెద్దపంజాణి మండలంలోని రాయలపేట జెడ్పీ హైస్కూల్‌ను సమస్యాత్మక కేంద్రంగా గుర్తించారు. ఆ కేంద్రంలో సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు.

ఏప్రిల్ 3 నుంచి ఆరంభం

సరిగ్గా వచ్చే సోమవారం నుంచి పరీక్షలు ఆరంభం కానున్నాయి. ఏప్రిల్ 3వ తేదీ నుంచి 18వ తేదీ వరకు ఈ పరీక్షలు జరగనున్నాయి. దీంతో తల్లిదండ్రులు, విద్యార్థులు పరీక్షలకు సన్నద్ధమవుతున్నారు. అధికారులు పరీక్ష కేంద్రాల వద్ద అన్ని రకాల ఏర్పాట్లు సిద్ధం చేశారు. ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించేందుకు విద్యాశాఖ, జిల్లా కామన్ పరీక్షల బోర్డు(డీసీఈబీ) ఆధ్వర్యంలో సబ్జెక్టు నిపుణులతో కలిసి 'విజయసాధన' పుస్తకం ముద్రించి అందించింది. దాంతోపాటు ఉదయం, సాయంత్రం వేళల్లో విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహించి విద్యార్థులను పరీక్షలకు సిద్ధం చేశారు.

విద్యార్థులూ.. పారా హుషార్

- పరీక్షలంటే భయాన్ని వదిలి, చదువుపై దృష్టి పెట్టాలి.
- తల్లిదండ్రుల మానసిక ధైర్యాన్ని అందించాలి.
- ప్రతి గంటకూ కాసేపు విశ్రాంతినివ్వాలి.
- ప్రతి రోజూ సరైన నిద్ర, పౌష్టికాహారం తప్పనిసరి.
- ఇప్పుడు కొత్త పాఠ్యాంశాలు చదవకుండా రివిజన్ మాత్రమే చేసుకోవాలి.
- అన్ని సబ్జెక్టులకు ప్రాధాన్యమివ్వాలి.

ప్రశాంతంగా పరీక్ష రాయండి



పదో తరగతి విద్యార్థులు ప్రశాంత వాతావరణంలో పరీక్షలు రాయాలి. అందుకోసం విద్యాశాఖ అధికారులు ఏర్పాట్లు చేయాలని ఆదేశించాం. విద్యార్థులకు ఎలాంటి భయాందోళన అవసరం లేదు. పరీక్షల సిబ్బంది ఎలాంటి పొరబాట్లకు తావివ్వకూడదు.

– హరి నారాయణన్, కలెక్టర్, చిత్తూరు

పటిష్ట ఏర్పాట్లు చేశాం



పదో తరగతి పరీక్షలకు జిల్లాలోని 115 పరీక్ష కేంద్రాల వద్ద పూర్తిస్థాయిలో ఏర్పాట్లు చేశాం. అన్ని శాఖల అధికారుల సహకారంతో వసతులు కల్పించాం. పరీక్షల నిర్వహణకు అవసరమైన సీఎస్, డీఓ, ఇతర అధికారులు, స్క్వాడ్స్‌ను నియమించాం.

– విజయేంద్రరావు, డీఈవో, చిత్తూరు.

క్లుప్తంగా

తల్లి తిట్టిందని యువతి ఆత్మహత్య


మృతి చెందిన శ్యామల

చౌడేపల్లె: తల్లి మందలించిందని యువతి ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలోని బోయకొండ సమీపంలోని యానాది పాళ్యం వద్ద శనివారం రాత్రి చోటుచేసుకొంది. ఎస్‌ఐ రవికుమార్ కథనం మేరకు పదేళ్ల క్రితం భార్యభర్తలైన భీమయ్య, మల్లెమ్మ విడిపోయి వేర్వేరుగా ఉంటున్నారు. తల్లి మల్లెమ్మ యానాదిపాళ్యం వద్ద ఉండగా, తండ్రి భీమయ్య పందిళ్లపల్లె పంచాయతీ ముదిరెడ్డి పల్లె వద్ద నివాసముంటున్నారు. తల్లి వద్ద ఉన్న కుమార్తె శ్యామల(18) తల్లికి తెలియకుండా మూడురోజుల క్రితం తండ్రి భీమయ్య వద్దకు వెళ్లింది. విషయం తెలుసుకొన్న మల్లెమ్మ తన కుమార్తె శ్యామలను తండ్రి వద్దనుంచి ఇంటికి శనివారం తీసుకెళ్లింది. మందలించడంతో మనస్థాపం చెంది ఇంట్లో ఉరివేసుకొని మృతి చెందింది. గమనించిన కుటుంబీకులు కేకలు వేయగా అప్పటికే శ్యామల మృతి చెందినట్లు నిర్ధారించారు. ఈమేరకు పోలీసులు కేసు నమోదుచేసి శవాన్ని పోస్టుమార్టం నిమిత్తం పుంగనూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

హుషార్‌గా..!


రోదసీలోకి దూసుకెళుతున్న ఎల్‌వీఎం3-ఎం3 రాకెట్

అంతరిక్ష పరిశోధనల్లో భారతదేశం ఖ్యాతి ఇనుమడించింది.. ప్రపంచదేశాల్లో తిరుగులేని శక్తిగా అవతరించింది.. వాణిజ్య ఉపగ్రహాల ప్రయోగంలో మరోసారి విజయకేతనం ఎగురవేసింది.. ఇస్రో బాహుబలిగా పేరుగాంచిన జీఎస్‌ఎల్‌వీ (ఎల్‌వీఎం–3– ఎం3) రాకెట్ నిప్పులు చిమ్ముతూ నింగిలోకి దూసుకెళ్లింది.. నిర్ణీత సమయంలో నిర్దేశిత కక్ష్యలోకి సురక్షితంగా శాటిలైట్లను ప్రవేశపెట్టింది.. ప్రతిష్టాత్మక ప్రయోగం జయప్రదం కావడంతో షార్ శాస్త్రవేత్తల సంబరం అంబరాన్నంటింది.


శ్రీహరికోట రాకెట్ కేంద్రంలోని గ్యాలరీ నుంచి ప్రయోగాన్ని వీక్షిస్తున్న సందర్శకులు

- విజయవంతంగా ఎల్‌వీఎం3–03 ప్రయోగం
- నిర్దేశిత కక్ష్యలోకి చేరిన 36 ఉపగ్రహాలు
- ఫలించిన షార్ శాస్త్రవేత్తల కృషి
- ఇనుమడించిన ఇస్రో ఖ్యాతి

సూళ్లూరుపేట : భారత అంతరిక్ష పరిశోదనా సంస్థ (ఇస్రో) సతీష్ ధవన్ స్పేస్ సెంటర్ షార్ నుంచి ఆదివారం ఉదయం 9.00.20 గంటలకు ఎల్‌వీఎం 3–ఎం3 ఉపగ్రహ వాహకనౌకను విజయవంతంగా ప్రయోగించింది. యునైటెడ్ కింగ్‌డమ్‌కు చెందిన నెట్‌వర్క్ యాక్సెస్ అసోసియేషన్ లిమిటెడ్ వన్‌వెబ్ ఇండియా–2 పేరుతో 36 ఉపగ్రహాలు విజయవంతంగా కక్ష్యలోకి చేర్చింది. కేవలం 97 నిమిషాల్లోనే భూమికి 450 కిలోమీటర్లు ఎత్తులోని లోయర్ ఎర్త్ ఆర్బిట్‌లో సురక్షితంగా ప్రవేశపెట్టింది. ఇస్రో బాహుబలి రాకెట్‌గా పేరు గాంచిన ఎల్‌వీఎం3–ఎం3 లాంటి భారీ రాకెట్‌ను వాణిజ్య ప్రయోగాలకు ఉపయోగించడం ఇది రెండోసారి కావ డం విశేషం . దీంతో ఎల్‌వీఎం3–ఎం3 రాకెట్ గ్లోబల్ కమర్షియన్ లాంచ్ సర్వీస్ మార్కెట్లోకి ప్రవేశించింది.

శాస్త్రవేత్తల సంబరం

ఆదివారం ఉదయం కౌంట్‌డౌన్ పూర్తి కావడంతో మిషన్ కంట్రోల్ సెంటర్‌లో నిశ్శబ్ద వాతావరణం నెలకొంది. పెద్ద శబ్దంతో ఎల్‌వీఎం3–ఎం3 రాకెట్ నిప్పులు చిమ్ముతూ 5,805 కిలోలు బరువు కలిగిన వన్‌వెబ్ ఇండియా–2 రాకెట్ 36 కమ్యూనికేషన్ ఉపగ్రహాలను మోసుకుని నింగికేగింది. పూర్తి స్వదేశీ సాంకేతిక పరిజ్ఞానంతో తయారు చేసి మూడో దశలో అమర్చిన 25 టన్నుల క్రయోజనిక్ ఇంధనం సాయంతో దూసుకెళ్లింది. రాకెట్ శిఖరభాగంలో అమర్చిన 36 ఉపగ్రహాలను నాలుగేసి ఉపగ్రహాల చొప్పున 9 సార్లుగా 97 (1.37 గంటల వ్యవధిలో) నిమిషాలకు నిర్ణీత కక్ష్యలోకి విజయవంతంగా ప్రవేశపెట్టింది. ఎల్‌వీఎం3–ఎం3 రాకెట్ వరుసగా ఆరోసారి విజయం సాధించడంతో ఇస్రో శాస్త్రవేత్తల ఆనందానికి అవధులు లేకుండా పోయాయి.

వీక్షకుల గ్యాలరీలో సందడి

రాకెట్ ప్రయోగాన్ని వీక్షించేందుకు మన రాష్ట్రంతో పాటు, తమిళనాడు, తెలంగాణ, కర్ణాటక నుంచి సుమారు పది వేలమందికి పైగా విచ్చేశారు. సూళ్లూరుపేట నుంచి శ్రీహరికోట వరకు కార్లు, స్కూల్ వ్యాన్లు, బస్సులు పెద్దసంఖ్యలో బారులు తీరాయి. సందర్శకులు రాకెట్ ప్రయోగాన్ని వీక్షించేందుకు అనువుగా శ్రీహరికోటలో షార్ అధికారులు ఒక ప్రత్యేక గ్యాలరీని ఏర్పాటు చేశారు. అలాగే పులికాట్ సరస్సు వద్ద రోడ్డుపై సైతం భారీగా జనం చేరుకున్నారు. రాకెట్ నింగిలోకి దూసుకెళుతుంటే ప్రజలు ఉత్సాహంగా చప్పట్లు, ఈలలతో హర్షాతిరేకాలు వ్యక్తం చేశారు. ప్రయోగం విజయవంతం కావడంతో సంబరాలు చేసుకున్నారు.


రాకెట్ నుంచి విడిపోతున్న ఉపగ్రహం

ఇస్రో శాస్త్రవేత్తలకు అభినందనలు

ఎల్‌వీఎం3–ఎం3 ప్రయోగాన్ని విజయవంతం కావడంపై ఎంపీ గురుమూర్తి, ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య సంతోషం వ్యక్తం చేశారు. ఘనతను సాధించిన ఇస్రో శాస్త్రవేత్తలకు అభినందనలు తెలిపారు. వాణిజ్యపరమైన ప్రయోగాలు చేయడంలో మరోసారి సత్తాచాటారని కొనియాడారు. అలాగే శ్రీసిటీ ఎండీ రవీంద్ర సన్నారెడ్డి సైతం రాకెట్ ప్రయోగంపై స్పందించారు. దేశ ప్రతిష్టను పెంచిన ఇస్రో చైర్మన్ కె.సోమనాథ్, షార్ డైరెక్టర్ ఎ.రాజరాజన్, శాస్త్రవేత్తలకు కృతజ్ఞతలు తెలిపారు. వాణిజ్య పరంగా ఇది ఘనవిజయమని ప్రశంసించారు.

అరగొండలో ఆర్థోస్కోపీ సర్జరీలకు ఆరోగ్యశ్రీ


మీడియాతో మాట్లాడుతున్న చంద్రశేఖర్ రెడ్డి, డాక్టర్ కార్తీక్ రెడ్డి

తవణంపల్లె: అరగొండ అపోలో ఆస్పత్రుల్లో అధునాతన యంత్రాలతో ఆర్థోస్కోపీ సర్జరీలు ఆరోగ్య శ్రీ ద్వారా నిర్వహిస్తున్నట్లు అరగొండ అపోలో హాస్పిటల్ మేనేజర్ చంద్రశేఖర్ రెడ్డి, ఆర్థోస్కోపీ సర్జరీ స్పెషలిస్టు డాక్టర్ కార్తీక్ రెడ్డి తెలిపారు. వారు ఆదివారం అరగొండ అపోలో హాస్పిటల్లో మీడియాతో మాట్లాడారు. ఆస్పత్రిలో మోకాలు, భుజాలు ఎముకలకు సంబంధించి అధునాతన యంత్రం ద్వారా ఆర్థోస్కోపీ సర్జరీలను ఆరోగ్యశ్రీ పథకం ఉచితంగా సర్జరీలు చేస్తామన్నారు. ఇలాంటి సర్జరీలకు రూ.1.20 లక్షల వ్యయం అవుతుందన్నారు. కానీ రోగులకు ఆర్థిక భారం కాకుండా ఆరోగ్య శ్రీ పథకం కింద ఉచితంగా చేయించే అవకాశం అరగొండ అపోలో హాస్పిటల్లో ఉందన్నారు. జిల్లాలోని ప్రజలు ఈ అవకాశంను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. సమావేశంలో ఈఓ భానుప్రకాష్ రెడ్డి, పీఆర్ఓ కమ్రుద్దీన్ పాల్గొన్నారు.

నిబంధనలు ఉల్లంఘించిన అర్చకుడి సస్పెన్షన్

కాణిపాకం(యాదమరి): కాణిపాక శ్రీ వరసిద్ధి వినాయక స్వామి అనుబంధ ఆలయం శ్రీ వీరాంజనేయ స్వామి ఆలయ అర్చకులు కృష్ణమోహన్ నిబంధనలు ఉల్లంఘించడంతో ఆలయ ఈఓ వెంకటేశు సస్పెండ్ చేశారు. ఈ నెల 25న శనివారం శ్రీ వీరాంజనేయ ఆలయంలో అర్చకులుగా విధులు నిర్వహించే కృష్ణ మోహన్ సెలవు కావాలని ఈఓ కార్యాలయానికి వెళ్లి ఈఓ వెంకటేశుకు ధరఖాస్తు చేసుకున్నారు. అయితే సెలవు కాలంలో విధులు నిర్వహించే అర్చకులచే, ఆలయ సహాయ అధికారిచే సంతకాలు తీసుకొని రావాలని ఈఓ కోరారు. దీనిపై అర్చకులు ఈఓతో దుర్భాషలాడారు. ఈ విషయమై ధర్మకర్తలి మండలి సమావేశంలో చర్చించగా అర్చకులను సస్పెండ్ చేయాలని నిర్ణయించారు. దీనిపై అతనిని తాత్కాలికంగా విధుల నుంచి తొలగిస్తున్నట్లు ఈఓ ఆదేశాలు జారీ చేశారు.

వరసిద్ధుని సేవలో హైకోర్టు న్యాయమూర్తి


జస్టిస్ మానవేంద్రనాథ్ రాయ్‌కి స్వామివారి చిత్రపటం అందిస్తున్న ఆలయ ఈఓ వెంకటేశు

కాణిపాకం(యాదమరి) : కాణిపాక శ్రీ వరసిద్ధి వినాయక స్వామిని ఆంధ్రప్రదేశ్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ మానవేంద్రనాథ్‌రాయ్ దర్శించుకున్నరు. ఆదివారం మధ్యాహ్నం ఆయన స్వామివారి దర్శనార్థం విచ్చేయగా ఆలయ ఈఓ వెంకటేశు స్వాగతం పలికి స్వామివారి ప్రత్యేక దర్శనం కల్పించారు. అనంతరం వేదపండితులు ఆశీర్వచనం అందించగా ఆలయ అధికారులు స్వామివారి చిత్రపటం తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో చిత్తూరు జిల్లా ప్రధాన న్యాయమూర్తి భీమారావు, చిత్తూరు ఆర్డీఓ రేణుక, ఆలయ ఏఈఓ విద్యాసాగర్ రెడ్డి, చిత్తూరు వెస్ట్ సీఐ శ్రీనివాసులురెడ్డి, ఐరాల తహసీల్దార్ సుశీల, ఆలయ సూపరింటెండెంట్‌లు, ఇన్‌స్పెక్టర్ పాల్గొన్నారు.

పాత పద్ధతిలోనే రుసుంల వాటాలు


మంత్రి పెద్దిరెడ్డికి వివరిస్తున్న సర్పంచ్ శాంతిసాగర్ రెడ్డి, నాయకులు

కాణిపాకం(యాదమరి): కాణిపాక శ్రీ వరసిద్ధి వినాయక స్వామి పార్కింగ్ రుసుంల వాటాలను పాత పద్ధతిలోనే పంచుకోవాలని మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రా రెడ్డి ఆలయ ఈఓకు సూచించినట్లు కాణిపాక సర్పంచ్ శాంతిసాగర్ రెడ్డి తెలిపారు. ఆయన కాణిపాకంలో విలేకర్లతో మాట్లాడుతూ కాణిపాక శ్రీ వరసిద్ధి వినాయక స్వామి టోల్‌గేట్ రుసుం రెండు దశాబ్దాలుగా పంచాయతీకి 60శాతం, ఆలయానికి 40 శాతం ఇస్తున్నారు. ఆలయంలో శనివారం నిర్వహించిన పాలక మండలి సమావేశంలో టోల్‌గేట్ రుసుంను ఆలయంకు 80శాతం ఇవ్వాలని తీర్మానించారు. దీనిపై సర్పంచ్, స్థానిక నాయకులు అందరూ కలసి తిరుపతిలోని మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రా రెడ్డికి సమస్యలు వివరించారు. ఆయన వెంటనే స్పందిస్తూ పాత పద్ధతిలోనే రుసుంలు చెల్లించేలా చూడాలని ఈఓ వెంకటేశుకు సూచించారని సర్పంచ్ వివరించారు. కార్యక్రమంలో మండల వైఎస్సార్ సీపీ నాయకులు గణేష్ ప్రసాద్ రెడ్డి, బుజ్జిరెడ్డి, జగన్నాధ రెడ్డి, రవి రెడ్డి, చిన్నారెడ్డి పాల్గొన్నారు.

కల్లూరు లయన్స్ క్లబ్‌కు అంతర్జాతీయ అవార్డు


అవార్డు అందుకుంటున్న పోకల తాతయ్య

పులిచెర్ల(కల్లూరు): కల్లూరు లయన్స్ క్లబ్‌కు అంతర్జాతీయ లయన్స్ క్లబ్ అవార్డు వచ్చినట్లు జిల్లా క్రీడావిభాగం అధ్యక్షుడు లయన్ మహమ్మదాలీ తెలిపారు. అంతర్జాతీయ అధ్యక్షుడు లయన్ డగ్లస్ అలెగ్జాండరు అంతర్జాతీయ అవార్డును ప్రకటించగా జిల్లా అదనపు కార్యదర్శి లయన్ గౌతంరెడ్డి ఆదివారం కల్లూరులో క్లబ్ అధ్యక్షుడు పోకల తాతయ్యకు అందజేశారు. 2009 నుంచి వివిధ సేవా కార్యక్రమాలు విజయవంతంగా నిర్వహిస్తూ ఉత్తమ ప్రతిభ కనబరచినందుకు ఈ అవార్డు వచ్చిందన్నారు. జిల్లా కోశాధికారి లయన్ బాబులాల్, సత్యప్రకాష్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

జిల్లా వాలీబాల్ అసోసియేషన్ కార్యవర్గం



పుంగనూరు: చిత్తూరు జిల్లా వాలీబాల్ అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఎన్నుకున్నారు. చిత్తూరుకు చెందిన సిరాజ్ బాషాను అధ్యక్షుడిగా, సుకుమార్‌ను ఉపాధ్యక్షుడిగా, గణేష్‌ను సంయుక్త కార్యదర్శిగా, కృష్ణారెడ్డిని చైర్మన్ ఎన్నుకున్నారు. సిరాజ్‌బాషా మాట్లాడుతూ వాలీబాల్ క్రీడలను ప్రోత్సహించేందుకు చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఈ సమావేశంలో క్రీడాకారులు జైపాల్, భరత్‌భూషణ్, జయరాం, చంద్రశేఖర్, నితిన్, చందా రెడ్డెప్పరెడ్డి, ఖమ్రుద్దీన్, ముష్టాక్ అహమ్మద్ పాల్గొన్నారు.

మూడు గడ్డి వాములు దగ్ధం


పూర్తిగా కాలిపోయిన గడ్డివాములు

పెద్దపంజాణి: కోగిలేరు చెక్ పోస్టు సమీపంలో ఉన్న ఒంటిల్లు వద్ద మూడు గడ్డి వాములు దగ్ధమైన సంఘటన ఆదివారం సాయంత్రం చోటు చేసుకుంది. బాధితుల కథనం మేరకు, జంగయ్య కుమారులు మణి, సుబ్రమణ్యం, మోహన్ ఒంటిల్లు వద్ద వేరు వేరుగా కాపురం ఉంటున్నారు. వ్యవసాయం చేస్తూ పశువులు పోషించుకుంటున్నారు. తమ పొలంలో పండించిన వరి గడ్డిని పలమనేరు–పుంగనూరు రోడ్డు పక్కనే వాములుగా వేసుకున్నారు. ఆదివారం సాయంత్రం పుంగనూరు వైపు నుంచి పల్సర్ ద్విచక్ర వాహనంలో వచ్చిన దుండగులు గడ్డివాములకు నిప్పు పెట్టి పరారయ్యారని బాధితులు తెలిపారు. ఈ క్రమంలో ఒక్కసారిగా మంటలు చెలరేగడంతో గడ్డివాములు అగ్నికి ఆహుతయ్యాయి. బాధితుల సమాచారంతో పలమనేరు అగ్నిమాపక శాఖ సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకుని మంటలను అదుపు చేసి పక్కనున్న మరో మూడు గడ్డివాములు కాపాడగలిగారు. దీనిపై బాధితులు పెద్దపంజాణి పోలీసులకు ఫిర్యాదు చేయనున్నట్లు తెలిపారు.

క్రీడలకు మెండుగా సర్కారు సహకారం


నూతనంగా ఎన్నికైన రాష్ట్ర బాస్కెట్‌బాల్ అసోసియేషన్ సభ్యులు

చిత్తూరు కలెక్టరేట్ : రాష్ట్ర ప్రభుత్వం క్రీడల బలోపేతానికి అన్ని రకాల సహాయ సహకారంలందిస్తోందని నూతనంగా ఎన్నికైన బాస్కెట్‌బాల్ రాష్ట్ర అధ్యక్షులు చెంగల్‌రాయనాయుడు తెలిపారు. కొంగారెడ్డిపల్లిలోని ఓ ప్రైవేట్ హోటల్‌లో ఆదివారం బాస్కెట్ బాల్ రాష్ట్ర కార్యవర్గ సమావేశం నిర్వహించారు. శాప్ నియమించిన అబ్జర్వర్ సమక్షంలో ఆ సంఘం రాష్ట్ర ఎన్నికలు నిర్వహించారు. అనంతరం మీడియాతో మాట్లాడారు. రైల్వే రాయితీని రద్దు చేయడం వల్ల ఇతర రాష్ట్రాలకు క్రీడాపోటీలకు వెళ్లే క్రీడాకారులకు ఇబ్బంది కలుగుతోందని రాష్ట్ర అధ్యక్షులు చెంగల్‌రాయనాయుడు డిమాండ్ చేశారు. కేంద్రప్రభుత్వం స్పందించి రైల్వే రాయితీని కల్పిస్తే ఎంతో మంది క్రీడాకారులకు మేలు జరుగుతుందని చెప్పారు. క్రీడాకారుల వసతి కోసం ఉన్నతాధికారులు భూమి కేటాయిస్తే తమ సొంత నిధులతో భవనం నిర్మించుకుంటామని వెల్లడించారు. ఆ సౌకర్యం కల్పిస్తే అన్ని క్రీడల్లో పాల్గొనే క్రీడాకారులకు ఉపయోగకరంగా ఉంటుందన్నారు.

రెండు గ్రామాలు దత్తత


గ్రామీణ ప్రాంతాల్లో క్రీడాకారులను బాస్కెట్‌బాల్‌లో ప్రోత్సహించేందుకు రెండు గ్రామాలను ముంబైకి చెందిన హైఫైవ్ ఫౌండేషన్ దత్తత తీసుకోనున్నట్లు ప్రకటించారు. ఆ ఫౌండేషన్ సభ్యులు ఇటీవల జిల్లాలో పర్యటించారన్నారు. జిల్లాలోని బంగారుపాళ్యం, గుడిపాల మండలంలో రెండు గ్రామాలను దత్తత తీసుకోనున్నారన్నారు. ఆ గ్రామంలో ప్రత్యేకంగా బాస్కెట్‌బాల్ కోర్టులతో పాటు, ఉచితంగా శిక్షకులతో ప్రత్యేక శిక్షణ ఇచ్చి క్రీడాకారులను పోటీలకు సన్నద్ధం చేస్తారన్నారు.

నూతన కార్యవర్గం

ఆంధ్రప్రదేశ్ బాస్కెట్‌బాల్ సంఘం రాష్ట్ర అధ్యక్షుడిగా చెంగల్‌రాయనాయుడు (చిత్తూరు జిల్లా) ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. విశ్రాంత హైకోర్టు జడ్జి రజని ఈ ఎన్నికలకు అబ్జర్వర్‌గా వ్యవహరించారు. రాష్ట్ర కార్యదర్శిగా చక్రవర్తి, టెక్నికల్ కమిటీ చైర్మన్‌గా సురేష్‌బాబు, సెలక్షన్ కమిటీ చైర్మన్‌గా అప్పలరాజు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. జిల్లా ముఖ్య శిక్షకులు బాలాజీ, భారత బాస్కెట్‌బాల్ సమాఖ్య టెక్నికల్ కమిటీ వైస్‌పర్సన్ నార్మన్‌ఐజాక్, ఒలింపిక్స్ సంఘం తరపున చంద్రశేఖర్, పలు జిల్లాల నుంచి సభ్యులు హాజరయ్యారు.

ఆర్థిక స్వావలంబనే ఆసరా ధ్యేయం

- ప్రతి అడుగులోనూ ఆడపడుచుల సంక్షేమానికి పెద్దపీట
- చెక్కుల పంపిణీలో డిప్యూటీసీఎం నారాయణస్వామి వ్యాఖ్య


వెదురుకుప్పం: మెగా చెక్కును అందజేస్తున్న ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామి

వెదురుకుప్పం: అక్కా చెల్లెమ్మల ఆర్థిక స్వావలంబనే వైఎస్సార్ ఆసరా ప్రధాన ధ్యేయమని ఉప ముఖ్యమంత్రి కళత్తూరు నారాయణ స్వామి వ్యాఖ్యానించారు. వెదురుకుప్పంలో ఆదివారం జరిగిన సమావేశంలో వైఎస్సార్ ఆసరా మెగా చెక్కును లబ్ధిదారులకు అందజేశారు. 961 స్వయం సహాయక సంఘాల్లోని 9,284 మంది మహిళలకు రూ.9.71 కోట్లు లబ్ధిచేకూరిందని తెలిపారు. అంతకు ముందు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. అనంతరం మహిళలను ద్దేశించి ప్రసంగించారు. సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి వేసే ప్రతి అడుగులోనూ ఆడపడుచుల సంక్షేమానికి పెద్ద పీట వేస్తున్నట్లు పేర్కొన్నారు. గత ప్రభుత్వం కేవలం ఎన్నికల్లో ఓట్ల కోసం పసుపు కుంకుమ పేరుతో మహిళలను మోసం చేసినట్లు విమర్శించారు. జగనన్నను నమ్మి ప్రజలు వేసిన ఓట్లతో గెలిచిన కొంతమంది ఎమ్మెల్యేలు డబ్బుకు అమ్ముడుపోయి తల్లిలాంటి పార్టీకి మోసం చేస్తున్నారని మండిపడ్డారు. కలకాలం మహిళల మోములో ఆనందం వెల్లివిరియాలంటే వైఎస్సార్‌సీపీకి అండగా నిలవాలని కోరారు. కార్యక్రమంలో వెలుగు పీడీ తులసీ, ఎంపీపీ నాగరాణి, జెడ్పీటీసీ సుకుమార్, సర్పంచ్ శిల్ప, ఎంపీడీఓ సుధాకరరావు, తహసీల్దార్ పుల్లారెడ్డి, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి బండి గోరవ్ధన్‌రెడ్డి, రాష్ట్ర సంయుక్త కార్యదర్శి హేమసుందర్‌రెడ్డి, బీసీ సెల్ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి బట్టే సుబ్రమణ్యం, మండల అధ్యక్షుడు పద్మనాభరెడ్డి, సీనియర్ నాయకుడు ధనంజయరెడ్డి, ఎంపీటీసీ సభ్యుడు మురళీరెడ్డి, భాస్కర్, రాధిక, మునిచంద్రారెడ్డి, కో–ఆప్షన్ వెంకటేశ్, ఏఎంసీ మాజీ ఉపాధ్యక్షుడు రామయ్య, నాయకులు నారాయణరెడ్డి, మునికృష్ణారెడ్డి పాల్గొన్నారు.

సెలవు రోజు ఆదాయం రూ.8.53లక్షలు

చిత్తూరు కార్పొరేషన్: వార్షిక ఆదాయ లక్ష్యాన్ని చేరుకోవడానికి రాష్ట్ర వ్యాప్తంగా అన్ని సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాలు సెలవు రోజు ఆదివారం సేవలు అందించాయి. జిల్లాలో 8 సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాల్లో యథావిధిగా లావాదేవీలు నిర్వహించారు. మొత్తం 59 డాక్యుమెంట్లు రిజిస్ట్రేషన్ జరిగినట్లు జిల్లా రిజిస్ట్రార్ శ్రీనివాసరావు తెలిపారు. వాటి ద్వారా మొత్తం రూ.8,53,310 ఆదాయం వచ్చిందని వివరించారు.

బాలిక ఆత్మహత్య

సోమల: మండలంలోని కందూరు పంచాయతీ తుడుంవారిపల్లెకు చెందిన బాలిక ఆదివారం సాయంత్రం ఇంట్లో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకుంది. సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించి ఆత్మహత్యకు గల కారణాలపై విచారణ చేపట్టారు. అయితే బాలిక విషయమై తల్లిదండ్రులు గతంలో ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు అత్యాచారానికి యత్నించిన వ్యక్తిపై పోక్సో కేసు నమోదు చేసి ఆ వ్యక్తిని రిమాండ్‌కు పంపించారు.